క్లుప్తంగా

స్కూల్‌కు రూ.50 వేల విరాళం



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కోల నితిన్ తన తండ్రి స్మారకార్థం రూ.50 వేల విరాళం అందజేశారు. హెచ్ఎం గంగాధర్‌కు విరాళం సొమ్మును శనివారం అందజేసి డ్యూయెల్ డెస్కుల కోసం వినియోగించాలని కోరారు. అదేవిధంగా గ్రామానికి చెందిన లక్మ సంతోష్, నేళ్ల శ్రీనివాస్ రూ.5 వేల చొప్పున, పల్లె కిషన్ రూ.2500 అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ నీరడి సాయన్న, మారంపల్లి అశోక్, బైకాని మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సహకరించాలి

బాల్కొండ: విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని ముప్కాల్ మండలంలోని కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారిణి వినోద అన్నారు. పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు సకాలంలో పాఠశాలకు రావాలన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని సూచించారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో అందరూ పాల్గొనాలని కోరారు.

జీపీ సిబ్బందికి రూ.10లక్షల బీమా



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి జీపీ ఆధ్వర్యంలో రూ. 10 లక్షల బీమా చేయించారు. శనివారం 13 మంది సిబ్బందికి సంబంధించిన రూ.520 చొప్పున చెల్లించి పోస్టల్ బీమా పాలసీని తీసుకున్నారు. ఉప సర్పంచ్ రాజేశ్వర్, కార్యదర్శి నర్సయ్య, పోస్ట్‌మాస్టర్ షాహీనా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట/రుద్రూర్ : నవీపేట, రుద్రూర్ మండలాల మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు నవీన్‌కుమార్, ఆలూరు నరేందర్ శనివారం తెలిపారు. ఆరో తరగతిలో పూర్తిసీట్లకు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పోలీసు పరేడ్

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్కొండ, ముప్కాల్, మెండోరా పోలీస్ స్టేషన్ల సిబ్బంది శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి శనివారం పోలీస్ పరేడ్ నిర్వహిస్తామన్నారు. బాల్కొండ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం- 2005 పై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నిఖత్‌సుల్తానా అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహన ఏర్పర్చుకొని పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఎస్సై పీటర్, ఏఎస్సై శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, సమాచార హక్కు చట్టం బోధన్, బాన్సువాడ ప్రతినిధులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌పై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయం



ఆర్మూర్‌టౌన్: గణితంపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. ఆయా మండలాల్లో శనివారం గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఆయా మండలాల స్థాయి విజేతలకు ఆర్మూర్‌లో ఆర్డీవో వినోద్‌కుమార్, కమ్మర్‌పల్లిలో ఎంఈవో ఆంధ్రయ్య, పాతంగల్‌లో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూదం వెంకటేశ్ బహుమతులను అందజేశారు. ఈనెల 23న జిల్లా స్థాయి ప్రతిభాపరీక్ష పోటీలు నిజామాబాద్ నగరంలోని హరిచరణ్ మార్వాడీ పాఠశాలలో, 29న రాష్ట్రస్థాయి పోటీలు తెలంగాణయూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు గణితఫోరం జిల్లా అధ్యక్షుడు కాంతారావు తెలిపారు. ఎంఈవోలు, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

రామమందిర వేడుకలు

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని లిల్లిపుట్ పాఠశాలలో శనివారం అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీత, శ్రీరాముడు, లక్ష్మణుడు, హనుమంతుని వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ రామకృష్ణ ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం



సాలూరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న సాలూర మండల నాయకులు

- గాడి తప్పిన వ్యవస్థలను పటిష్టం చేస్తాం
- ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్: నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెండు, మూడు గ్రామాల పరిధిలో చెరుకు సాగుచేస్తే సరిపోదని, విస్తారంగా చెరుకును సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఐదారు నెలలు ఫ్యాక్టరీ నడిచే విధంగా పంటదిగుబడులు ఉండాలని సూచించారు. సాలూర, బోధన్ మండలం హున్సా, ఖాజాపూర్, సాలూర, సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్, కల్దుర్కి, చిన్నమావంది, పెగడాపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ సమస్య అధ్యయనం కోసం తనతోపాటు మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మరికొంత మంది ఎమ్మెల్యేలు, అధికారులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మరో ఆరునెలల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గాడి తప్పిన అన్నీ వ్యవస్థలను పటిష్టం చేస్తామని, ఏ శాఖలో చూసినా బాకీలే ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. నాణ్యతతో పదికాలాల పాటు ఉండే విధంగా రోడ్ల పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, టీచర్ల కొరత సమస్యను పరిష్కరిస్తామని, పిల్లలను ప్రభుత్వ బడులకే పంపాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల బిల్లుల చెల్లింపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, గ్రూప్ తగాదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఘనస్వాగతం.. సన్మానం

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అలాగే కుల సంఘాల ప్రతినిధులు సన్మానించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, జిల్లా నాయకుడు అల్లె రమేశ్, సర్పంచులు చంద్రకళ, శ్రీనివాస్‌రావు, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు చీలం శంకర్, చిద్రపు అశోక్, శివరాజ్ పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలి



నిజాంసాగర్ కెనాల్‌పై ధర్నా చేస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న షేక్ మున్నుకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించాలని ముస్లిం ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్‌పై ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో చైర్మన్ వ్యవస్థ లేకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. అవిశ్వాస తీర్మానం చేసి 16 రోజులు అవుతున్నదని, చైర్మన్ లేని పక్షంలో వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను కలెక్టర్ అప్పగించాలన్నారు. వైస్ చైర్మన్ మున్ను ముస్లిం అనే ఒకే కారణంతో ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం లేదని తమకు తెలిసిందన్నారు. మూడు రోజుల్లో మున్నుకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు ఇవ్వనిపక్షంలో రానున్న రోజుల్లో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక సభ్యులు, మైనార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అధ్యాపకురాలు మృతి



సీహెచ్ నిశిత (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సీహెచ్ నిశిత అనారోగ్యంతో మృతిచెందినట్లు కళాశాల ప్రిన్సిపల్ ధనవేణి తెలిపారు. నిశిత మృతికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



బాల్కొండ/పెర్కిట్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ స్పెషల్ డ్రైవ్ ద్వారా చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగంచుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవన్‌ను అదనపు కలెక్టర్‌తోపాటు ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్లు, అధికారులు పర్యవేక్షించారు. మెండోరా మండలం కోడిచర్ల, సావెల్, వెల్కటూర్ గ్రామాలను అదనపు కలెక్టర్ సందర్శించి ఓటరు నమోదును పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సంతోష్, తదితరులున్నారు. ఆర్మూర్ పట్టణంతోపాటు మండలంలో ఓటరు నమోదు ప్రక్రియను ఆర్డీవో వినోద్‌కుమార్ పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్ సింగ్ ఉన్నారు. మోస్రాలో ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ శ్రీకాంత్‌రావు పరిశీలించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అమ్దాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బోధన్‌రూరల్(బోధన్) : పేదలు, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదని, ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బోధన్ మండలం అమ్దాపూర్‌లో శనివారం నిర్వహించిన 'వికసిత్ భారత్..' కార్యక్రమానికి ఎంపీ అర్వింద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ స్థానిక సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు అందిస్తానన్నారు. బోధన్ ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తాను ఎమ్మెల్యేగా లేనప్పుడు పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు అడిగితే మంజూరు చేశానని ఎంపీ గుర్తు చేశారు. ఏ గ్రామానికైనా నిధులు అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి నిధులు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ తన కొడుకు ఎన్నిసార్లు రోడ్డు ప్రమాదాలు చేసినా, ఇతరులను ఇబ్బందులకు గురిచేసినా కాపాడడం సరికాదన్నారు. సర్పంచ్ సిర్ప మంజుల, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, మండలాధ్యక్షులు మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

మాక్లూర్, కోటగిరి మండలాల్లో..

మాక్లూర్/రుద్రూర్: మాక్లూర్ మండలం వెంకటాపూర్, కోటగిరి మండలం యాద్గార్‌పూర్, ఎత్తొండ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. యాద్గార్‌పూర్, ఎత్తొండ గ్రామాల ప్రజలకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవోలు క్రాంతి, మనోహర్‌రెడ్డి, సర్పంచులు భవాని, విజయసాయన్న, మాక్లూర్ తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



రుద్రూర్: ధ్రువీకరణపత్రాలు లేకుండా కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములో ధాన్యం ఎందుకు నిల్వ చేశారని స్థానిక ఎంపీటీసీ, డీసీసీ కార్యదర్శి కొట్టం మనోహర్ ప్రశ్నించారు. గోదామును శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించగా, 36 మంది రైతుల ధాన్యం ఉందని మార్కెట్ సిబ్బంది వివరించారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా ధాన్యం నిల్వ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాపారుల ధాన్యం ఉంటే ఖాళీ చేయించాలని సూచించారు. మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షాహీద్, పార్టీ కోటగిరి మండల అధ్యక్షుడు అయూబ్ ఉన్నారు.

ఆలయాల శుద్ధి, పారాయణం



పెర్కిట్‌లోని వేంకటేశ్వర ఆలయాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ/రుద్రూర్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠాపనను పురస్కరించుకొని స్వచ్ఛ తీర్థ మహాఅభియాన్ కార్యక్రమంలో భాగంగా పలు ఆలయాలను శనివారం శుద్ధి చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వేంకటేశ్వర ఆలయాన్ని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుద్ధి చేశారు. దమాంకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలోని ఆలయాలను యువకులు శుద్ధి చేశారు. పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. రుద్రూర్, కోటగిరి మండలాల్లోని ఆలయాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. రుద్రూర్ పాండురంగ విఠలేశ్వర ఆలయంలో సాయంత్రం, జవహర్‌నగర్ హనుమాన్ మందిరంలో ఉదయం హనుమాన్ చాలీసా, శ్రీరామ రక్షాస్తోత్రం పారాయణం చేశారు. సోమ వారం వరకు పారాయణం కొనసాగుతుందని తెలిపారు.

మా వాటాగా షట్టర్ ఇస్తే..

- అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేయిస్తాం
- బాల్కొండ మండల కేంద్రంలో ఇష్టారాజ్యం

బాల్కొండ: ''సరైన డాక్యుమెంట్లు, పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేయిస్తాం.. మా వాటాగా షట్టర్ ఇవ్వండి..'' ఇదీ బాల్కొండ మండల కేంద్రంలోని పరిస్థితి. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ప్రజాప్రతినిధుల ముసుగులో ఉన్న కొందరు రాత్రికిరాత్రి నిర్మాణ పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చట్టంలోని లోపాలను ఆసరా చేసుకొని అక్రమ నిర్మాణాల జోరుసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని వీడీసీ సభ్యులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారికి ఆనుకొని 44 నాలుగు షట్టర్ల నిర్మాణ స్థలంపై వివాదం ఉందని, కొందరు ప్రజాప్రతినిధులు కలిసి తమవంతు ఒక షట్టరు తీసుకుని కట్టడాన్ని చివరి దశకు తీసుకువచ్చారని పలువురు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అనుమతులులేకపోవడంతో అధికారులు పలుమార్లు పనులను నిలిపివేశారని, అయితే.. రాత్రి వేళల్లో పనులు చేపట్టి తుది దశకు తీసుకువచ్చారంటున్నారు.

వాటాగా నిర్మాణాలే..

వివాదస్పద స్థలంలో నిర్మాణాలు పూర్తి కావాలంటే తమ వాటా కూడా నిర్మాణాల్లోనే అందించాలి. నాలుగు షట్టర్లు నిర్మిస్తే ఒక షట్టరు, ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే వేరో చోట షట్టర్ నిర్మాణానికి కావాల్సిన స్థలం అప్పగించాలి. ఇలా మండల కేంద్రంలో కోట్ల విలువైన భూములు చేతులు మారుతున్నాయి. ఇదిలా ఉండగా.. అనుమతులు ఓ చోట తీసుకొని, మరోచోట నిర్మాణాలు చేపట్టినా పట్టించుకునేవారు కరువయ్యారు.

పనులను నిలిపి వేశాం

మండల కేంద్రంలో అనుమతులులేకుండా చేపట్టిన నిర్మాణ పనులను నిలిపివేశాం. నోటీసులు సైతం జారీ చేశాం. ఎక్కడ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా పనులను నిలిపి వేస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రజనీకాంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, బాల్కొండ

అసంపూర్తిగా టాయిలెట్ల నిర్మాణం

- ఇబ్బందులు పడుతున్న గురుకుల బాలికలు



స్లాబ్ వేసి పనులను నిలిపివేసిన దృశ్యం

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం అసంపూర్తిగా మిగలడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల సాధారణ నిధులు రూ.3.80 లక్షలతో టాయిలెట్ల నిర్మాణ పనులను మండల ప్రజాప్రతినిధి, గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధి చేపట్టారు. పాఠశాల భవనం పైఅంతస్తులో నిర్మాణ పనులను స్లాబ్ వరకు వేసి అయ్యిందనిపించారు. అంతకుముందే మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి టాయిలెట్ల నిర్మాణ పనులను పరిశీలించి, నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు తామే నిర్మాణం పనులను పూర్తి చేసి విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పనులు ప్రారంభించారు. ఇందుకోసం పాఠశాలలో ఇతర పనుల కోసం దాతలు ఇచ్చిన ఇసుక, కంకరను వాడారు. స్లాబ్ వరకు వేసి గత మూడు నెలలుగా పనులను అసంపూర్తిగా వదిలేశారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంతో అంచనాలను రూపొందించుకొని బిల్లులు తీసుకున్నారు. పనులు అసంపూర్తిగా మిగిలానా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పనులు పూర్తి చేసిస్తామని చెప్పిన నాయకులు ముఖం చాటేస్తున్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులకు అధికారులు బిల్లులు చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాతలు ఇచ్చిన ఇసుక, కంకర వినియోగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, డీఈ రాజయ్య, ఎంపీడీవో గోపాలకృష్ణ అసంపూర్తిగా ఉన్న పనులను శనివారం పరిశీలించారు.

రికార్డు చేసింది వాస్తవమే

గురుకుల పాఠశాలలో మండల సాధారణ నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు బిల్లు రికార్డు చేసి ఇచ్చిన మాట వాస్తవమే.

– లిఖిత, పీఆర్ ఏఈ

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

బాల్కొండ: మండలకేంద్రానికి చెందిన పలు బాధిత కుటుంబాలను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. సాగర్ తండ్రి పది రోజుల క్రితం మరణించగా, అదే గ్రామానికి చెందిన బండి మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే రాజేందర్ సతీమణికి గుండె సంబంధిత ఆపరేషన్ చే యించుకోగా ఆమెను కూడా పరామర్శించా రు.ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్, నాయకులు కుందారపు శ్రీనివాస్, ఊషన్న, యూనుస్, అన్వర్, కట్టెల శ్రీనివాస్ తదితరులున్నారు.

పెద్దోళ్ల గంగారెడ్డికి సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పెద్దోళ్ల గంగారెడ్డిని పెర్కిట్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెస్సు అనిల్, ఆకుల రాజు, ఆకుల శ్రీనివాస్, దమాంకర్ శ్రీనివాస్, పులి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు

మాక్లూర్: మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై సుధీర్‌రావు అధ్యక్షతన శనివారం రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఏసీపీ నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు మెమో

ఎడపల్లి (బోధన్): మండలంలోని ఠాణాకలాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ నరేందర్‌కు మండల విద్యాధికారి రామారావు శనివారం మెమో జారీ చేశారు. హెచ్ఎం స్కీముల పేరుతో వసూళ్లు చేస్తున్నాడని రెండు రోజుల క్రితం ఎమ్మెల్యేకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – గుంటూరు కారం (తెలుగు)- 9.40
సైంధవ్ (తెలుగు)- 1.00, 7.05, 10.05 - హనుమాన్ (తెలుగు) 4.00

స్క్రీన్-2 – హనుమాన్ (తెలుగు)- 9.00
గుంటూరుకారం 12.20, 3.40, 7.00, 10.20

స్క్రీన్-3 – హనుమాన్ (తెలుగు)- 9.10, 12.30, 3.50, 7.25,
నా సామిరంగ (తెలుగు) 10.45

స్క్రీన్-4 – నా సామిరంగ (తెలుగు)- 10.20, 1.30, 4.40, 7.50
హనుమాన్ (తెలుగు) - 11.00

సంక్షిప్తం

రామ భక్తుల పాదయాత్ర



బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన రామభక్తులు శనివారం రాత్రి బాల్కొండ మండలం కిసాన్‌నగర్ రామాలయానికి పాదయాత్రగా వెళ్లారు. అయోధ్యలో శ్రీరామ విగ్రహప్రతిష్ఠాపను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపినాథ్, ముస్కు నర్సయ్య, సంతోష్‌రెడ్డి, భూమేశ్, నర్సయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.

భూమి పూజ

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సర్పంచ్ అలేఖ్యమహేశ్‌గౌడ్ భూమిపూజ చేశారు. రూ.5లక్షలతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. అంబేడ్కర్ మాదిగ దళిత సేవ సంఘం నాయకులు డప్పు పోచయ్య, జంగం ఎల్లయ్య, నాగేందర్, రాంకుమార్, ప్రశాంత్, గొర్రె స్వామి, వీర స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్మల్ బీవోటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. పీఆర్వో బడుగు స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీపై అసహనం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపీటీసీ కొట్టం మనోహర్ తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన పాఠశాలలో పైప్‌లైన్ లీకేజీ కావడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఆయన వెంట నాయకులు షాహిద్ హుస్సేన్, అయూబ్ ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

బోధన్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ(ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) డివిజన్ కార్యదర్శి రాజన్న ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

రుద్రూర్: పాతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం ఆవరణలో సద్గురు మహదేవ్‌స్వామిజీ ఆధ్వర్యంలో కొలను పాక పుణ్యక్షేత్రం మహాపాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. మార్చి 13నుంచి 22వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పాతంగల్ మండలానికి 11న చేరుకుంటుందని తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్: యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విభాగ్ సంఘటనమంత్రి రాజశేఖర్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడమైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా సమ్మేళనం నిర్వహిస్తున్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, ఏబీవీపీ నాయకులు వెంకటకృష్ణ, సునీల్, సుహాస్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.